క్లుప్తంగా...

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరవుతారని మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి అన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

హోంమంత్రి మహమూద్ అలీ



లబ్ధిదారులకు వాహనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ యువతకు ఉపాధి కల్పిస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. బుధవారం ఆరాంఘర్ చౌరస్తాలోని మెట్రోక్లాసిక్ గార్డెన్‌లో మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో డ్రైవర్ కమ్ ఓనర్ పథకం కింద లబ్ధిదారులకు వాహనాల పంపిణీ కార్యాక్రమాన్ని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల వారు కేసీఆర్‌ను ఆదరిస్తున్నారన్నారు. ముస్లిం, మైనార్టీల కోసం గతంలో ఏ ప్రభుత్వం చేయని పథకాలను తీసుకొచ్చి ఆదుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎటు చూసినా సీఎం కేసీఆర్ పథకాలే కనిపిస్తున్నాయని, మరోసారి కేసీఆర్ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మైనార్టీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ చైర్మన్ ఇంతియాజ్ , రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో పెరిగిన ఓటర్లు

రాజేంద్రనగర్: నియోజకవర్గం ఓటర్ల తుది జాబితాను అధికారులు ప్రకటించారు. మొత్తం ఓటర్లు 5,52,362 మంది ఓటర్లుగా నమోదైనట్లు బుధవారం వివరించారు. 2,88,270 మంది పురుషులు, 2,64,053 మంది మహిళలు, ఇతరులు 39 మంది ఓటర్లు జాబితాలో ఉన్నారని వెల్లడించారు. గతంలో కంటే బుధవారం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లతో పాటు శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీ, బండ్లగూడ కార్పొరేషన్‌తో పాటు గ్రామ పంచాయతీలలో ఓటర్ల శాతం పెరిగింది. గత జాబితాలో 5,10,221 మంది ఓటర్లు నమోదై ఉండగా.. బుధవారం విడుదల చేసిన తుది జాబితాలో 42 వేల మంది కొత్తగా ఓటర్లు చేరారు.

కొత్త ఓటర్లు 10,488 మంది..

ఎన్నికల కమిషన్ 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తూ.. దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో 18 ఏళ్లు నిండిన 10,488 మంది కొత్త ఓటర్లుగా జాబితాలో చేరారు. వీరంతా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త ఓటర్లు 10 వేలకు పైగా చేరారు.

30–39 ఏళ్ల వారే అధికం..

నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్లలో 30–39 ఏళ్లున్న ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. వీరి ఓట్లే కీలకంగా మారనున్నాయి. 5,52,362 మంది ఓటర్లలో 1,82,224 మంది వీరే కావడం గమనార్హం.

కాంగ్రెస్ 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర



కోకాపేట్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

మణికొండ: రాజేంద్రనగర్ కాంగ్రెస్‌పార్టీ టికెట్‌ను ఆశిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ 'హాథ్ సే హాథ్ జోడోయాత్ర' బుధవారం నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట్‌లో కొనసాగింది. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో గెలిస్తే అమలుచేసే ఆరు హామీలను ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. తమ హామీలను పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, కౌన్సిలర్లు విజయ్‌బాబు, దుర్గేష్ యాదవ్, అమరేందర్‌రెడ్డి, నాయకులు యాదగిరి, కిరణ్, పాపిరెడ్డి, నవీన్‌కుమార్, శ్రీనివాస్, దశరథ్, కిరణ్, అశోక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అండగా ప్రభుత్వం



నర్కూడలో మహిళలకు బతుకమ్మ చీరను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: రాష్ట్ర ఆడపడుచులకు సీఎం కేసీఆర్ దసరా కానుకగా.. పుట్టింటి సారెగా చీరలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని నర్కూడలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ చీరలను అందజేస్తామన్నారు. గ్రామంలోని యువజన సంఘం సభ్యులకు క్రీడా సామగ్రి అందజేశారు. సర్పంచ్ సిద్దులు, ఎంపీటీసీ గౌతమి, ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీరాజు, సొసైటీ చైర్మన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం..

మండలంలోని ననాజీపూర్, మల్కారం, కాచారంలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.1.26 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్లు, భూగర్భ మురుగు కాలువపనులు, మల్కారం పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం దశలవారీగా అభివృద్ధి చెందుతూ.. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సర్పంచ్‌లు కల్పన, మాధవి, గోపాల్, వైస్ ఎంపీపీ నీలం, ఎంపీటీసీ క్రాంతికుమార్, నాయకులు పాల్గొన్నారు.

బండ్లగూడ: అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 08, 11, 12, 18, 20 డివిజన్‌లలో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బతుకమ్మ చీరలను బుధవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్ పాల్గొని లబ్ధిదారులకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు అన్ని పండగలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకునేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. కమిషనర్ శరత్‌చంద్ర పీఏసీఎస్ చైర్మన్‌రాందాస్‌ముదిరాజ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, గోకరి శ్రీలతాసురేష్‌గౌడ్, అస్లాంబిన్ అబ్దుల్లా, ముద్దం రాము, సీనియర్ నాయకులు గోపాల్‌ముదిరాజ్, సయ్యద్ ఖాజా, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులున్నారు.

శివాజీ యూత్ ప్రాంతంలో...

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ శివాజీ యూత్ భవనంలో బుధవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. మున్సిపల్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా కార్పొరేటర్ గోకరి శ్రీలతాసురేష్‌గౌడ్‌తో కలిసి చీరలను అందజేశారు.

బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకోవాలి..

మణికొండ: దసరా పండగ సందర్భంగా బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా నిర్వహించుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నార్సింగి మహిళలకు బతుకమ్మ చీరలను ఆమె కమిషనర్ బి.సురేందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. కౌన్సిలర్లు అరుణజ్యోతి, విజిత, గోపాల సునీత, టీపీఎస్ పావనిరావు నార్సింగి మహిళలు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్, మున్సిపల్ డీసీ రవికుమార్, డీపీఓ రాధారాణి, అధికారులు, డివిజన్ అధ్యక్షులు ధర్మారెడ్డి, నాయకులు, లబ్ధిదారులున్నారు.

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్‌లో బుధవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, నాయకులు కుమార్‌యాదవ్ తదితరులున్నారు.



బండ్లగూడలో మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్, తదితరులు



18వ డివిజన్‌లో పంపిణీ చేస్తున్న దృశ్యం



నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి



డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

ఘనంగా ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు



ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్తిక్‌రెడ్డి, తదితరులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మాజీ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని పాల్మాకుల వద్ద ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంద్రారెడ్డి ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు పి.కార్తిక్‌రెడ్డి, పాల్మాకుల సొసైటీ చైర్మన్ కె.శ్రవణ్‌కుమార్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లయ్య, ఉపసర్పంచ్ ప్రవీణ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, జి.కృష్ణ, గోపాల్‌నాయక్ తదితరులున్నారు.

ఇంద్రారెడ్డి అందరి వాడు..

రాజేంద్రనగర్: పటోళ్ల ఇంద్రారెడ్డి 69వ జయంతిని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కోలన్ సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఇంద్రారెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వర్గీయ ఇంద్రారెడ్డి ప్రజల మనిషి, ప్రజా నాయకుడు, చేవేళ్ల గడ్డమీద చెరగని ముద్రవేశారన్నారు. తెలంగాణ రాష్ట్రసాధనకు ఉద్యమించిన యోధుడని కొనియాడారు. కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌కుమార్, వైఎస్‌ఆర్‌టీపీ నాయకులు కే.ఎస్.దయానంద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్, శెట్టిగారి నరేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోరని బాల్‌రాజ్, యాదమ్మ యాదవ్, జబీన్ హుస్సేన్, జాలిగం చిత్తారి, రగడంపల్లి శ్రావణ్‌కుమార్, పెండ్యాల సాయి మల్లిక్, మజ్జిగ నరేష్‌యాదవ్, దుంబాల ఉమారెడ్డి, రమేష్ ముదిరాజ్, సోమారం రవీందర్, బాలపురం సుధాకర్‌రెడ్డి, కోరని మహాత్మ, పచ్చ శ్రీనివాస్, గోల్కొండ రాజు, ఎడ్లకాడి సూర్యం, నందిగామ నర్సింహ, కొండమీది హరినాథ్, పంబాల రాజు, ప్రభాకర్‌రెడ్డి, శివగౌడ్, విశాల్, సురేష్, సదానంద్, కోరని కుమార్, లేవిరాజు, నాని తదితరులున్నారు.

సీబీఐటీలో 'బ్యూరో ఆఫ్ స్టాండర్డ్స్ క్లబ్'



మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త ఏఎస్‌ఎస్పీ శాస్త్రి

మణికొండ: సీబీఐటీ కళాశాలలో ప్రపంచ ప్రమాణాల దినోత్సవాల సందర్భంగా 'బ్యూరో ఆఫ్ స్టాండర్డ్స్ క్లబ్'ను ప్రారంభించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా క్లబ్ విశ్రాంత శాస్త్రవేత్త ఎఎస్‌ఎస్‌పీ శాస్త్రి, జాయింట్ డైరెక్టర్, సైంటిస్ట్ దిలీప్ చత్తర్, హైదరాబాద్ శాఖ ప్రమోషన్ అధికారి అభిసాయిలు మాట్లాడుతూ.. మనదేశ ప్రమాణాల సూత్రీకరణ, అనుగుణ్యత అంచనా, ప్రయోగశాల పరీక్ష తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు క్లబ్ కృషి చేస్తుందన్నారు. ఈ రంగంలో వివిధ ప్రమాణాలు, వాటి అభివృద్ధి, అవకాశాలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ప్రమాణం, నాణ్యతపై చర్చలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, నిర్వహణ కర్తలు డాక్టర్ సుధాకర్‌బాబు, ఎస్. సంతోష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులందరికీ తక్కువ ధరలో నాణ్యమైన, ప్రాధాన్యతో కూడిన వైద్యాన్ని అందించేందుకు రాయదుర్గంలోని సూపర్ స్పెషాలిటీ ఏరీట్ ఆసుపత్రి వారితో ఒప్పందం చేసుకున్నామని అధ్యక్షుడు సీతారాం దూళిపాల తెలిపారు. బుధవారం ఆల్‌కాలనీస్ ఫెడరేషన్, ఆసుపత్రి వర్గాల మధ్య ఒప్పందపత్రాన్ని మార్చుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యం, ఆరోగ్యం ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమని అలాంటి వాటిని తక్కువ ధరలతో అవసరం మేరకే అందించేందుకు ఆసుపత్రి కృషి చేస్తుందన్నారు. ఈ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఫెడరేషన్‌లో చేరిన వారికే వర్తింపజేస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, తిరుమలహిల్స్ అధ్యక్షుడు కాంతారావు, ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాకర్ రాజు, చీఫ్ బిజినెస్ అధికారి వెంకట్, మార్కెటింగ్ మేనేజర్ లవన్‌కుమార్ పాల్గొన్నారు.


గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన మస్రత్‌బేగం

శంషాబాద్ రూరల్: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి వాసి ఇబ్రహీం భార్య మస్రత్‌బేగం (25) ఈనెల 3న ఘాంసిమియాగూడ వద్ద రహదారి దాటుతుంది. అదే సమయంలో షాద్‌నగర్ వైపు నుంచి వచ్చిన వాహనం ఆమెను ఢీకొంది. తీవ్ర గాయాలైన మస్రత్ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీ పైపు బిగిస్తూ.. కిందపడి వ్యక్తి మృతి



బీమేష్ (ఫైల్)

మణికొండ: 30వ అంతస్తులో ఏసీ పైపులైన్ బిగిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఔటర్ సర్వీసు రోడ్డు పక్కనే నిర్మాణంలో ఉన్న నిర్మాణంలో ఉన్న ఓ గేటెడ్ కమ్యూనిటీలో నగరానికి చెందిన ఏపీ.బీమేష్(30) గత కొంత కాలంగా ఏసీ ఫిట్టింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం 30 వ అంతస్తులో పైపు బిగిస్తుండగా జారి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే ఉత్సాహంగా జరిగింది. విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో వేదిక హోరెత్తింది. భవిష్యత్తు ప్రణాళికతో ముందడుగు వేయాలని ప్రిన్సిపాల్ మాధవరెడ్డి విద్యార్థులకు సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభం



కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, తదితరులు

బండ్లగూడ: ప్రజా అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీ-సి బ్లాక్‌లో రూ.35 లక్షలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశాలతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. కమిషనర్ శరత్‌చంద్ర, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



దుస్తులను పంపిణీ చేస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మెన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: మనకు ఉన్న దాంట్లో కొంత లేని వారికి దానం చేస్తే ఎంతో మానసిక తృప్తి కలుగుతుందని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం అతని తల్లితండ్రులు కస్తూరి సత్తయ్య, నర్సమ్మ ఫౌండేషన్ ద్వారా 600 మంది మున్సిపల్ కార్మికులకు దసరా పండగకు దుస్తులను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, పుప్పాల్‌గూడ మాజీ సర్పంచ్ కె. బాలరాజ్‌ముదిరాజ్‌లు మాట్లాడుతూ.. సమాజంలో లేనివారు ఎంతో మంది ఉన్నారని, అలాంటి వారికి తమ శక్తి కొద్ది సాయం చేయటం మంచి పరిణామన్నారు. ప్రతిఏటా మున్సిపల్ కార్మికులకు బట్టలను పంపిణీ చేయడం శుభపరిణామన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తరించాలన్నారు. కౌన్సిలర్లు వందనానగేష్, మీన ముత్యాలు, లక్ష్మీమల్లేష్, పురుషోత్తం, లక్ష్మీనారాయణ, కో-ఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, జె.లక్ష్మీరాములు, జె.సిద్దప్ప, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ

మైలార్‌దేవ్‌పల్లి: మానసిక ఉల్లాసాన్ని పొందడానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్‌తో కలిసి క్రీడాకారులకు క్రికెట్, వాలిబాల్, టీషర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల పట్ల ప్రతి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశంలో క్రీడల పట్ల కేంద్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ఇస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థులకు షూస్ పంపిణీ



మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతో ఉందని నెక్నాంపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్ అన్నారు. బుధవారం కూకట్‌పల్లిలో ఈఎన్‌టీ డాక్టర్‌గా పనిచేస్తున్న జీవీఎస్ రావు కుమారుడు ఆర్యవ్ చేతుల మీదుగా 138 మంది విద్యార్థులకు షూస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఉపాధ్యాయులు అమల, సత్యవాణి, వీఆర్‌ఫర్‌యూ సేవా సంస్థ అధ్యక్షుడు బాపూజీ, ప్రతినిధులు దిలిప్‌కక్కడ్ శివరామకృష్ణ, శ్రీనివాస్, ప్రదీప్‌రావు, సాంబశివరావు, లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: అనారోగ్యాలతో ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన వారికి సీఎం సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆయన నివాసంలో బుధవారం అందజేశారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన ఎం. నరేందర్‌కు రూ.32వేలు, బాలరాజ్‌కు రూ.60వేలు, పాండుయాదవ్‌కు రూ.60వేలు, బిక్షపతికి రూ. 50,500ల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను కొనసాగిస్తుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేష్‌లు పాల్గొన్నారు.

రూ. 10.72 కోట్లతో పార్కుల అభివృద్ధి



చిత్రపురి కాలనీలో పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో రూ.10.72 కోట్లతో అభివృద్ధి చేసిన పార్కులు, సీసీరోడ్లు, చెరువు రైలింగ్, నాలా రిటర్నింగ్‌వాల్, పుప్పాల్‌గూడ, మణికొండ వైకుంఠధామాలు, మణికొండ ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి, దోభీఘాట్ అభివృద్ధి, చింత చెట్టు సర్కిల్‌లో బటర్‌ఫ్లై స్థూపాలను ఆయన చైర్మెన్ కె.నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీలలో ప్రజా సమస్యలను పరిష్కరించటంతో పాటు వారికి అవసరమైన భవనాలు, పార్కులు, శ్మశానవాటికలను ఏర్పాటు చేయడం అవసరమన్నారు. కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, మేనేజర్ రమేష్, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యాన విస్తరణ అధికారుల నియామకాలు చేపట్టాలి



కళాశాల ఎదుట నిరసన చేస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: ఉద్యాన విస్తరణ అధికారుల నియమకాలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు కళాశాలలో బుధవారం నిరసన చేపట్టారు. ఉద్యాన, డిప్లమాలు చదివి 20 ఏళ్లుగా వేచి చూస్తున్నామని, ఇప్పటివరకు నియామకాలు లేవన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖలో క్రమంతప్పకుండా నియామకాలు చేపడుతున్నారని, ఉద్యానశాఖలో నియామకాలు లేవని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన చేపడితే విశ్వవిద్యాలయంలో యాజమాన్యం విద్యార్థుల హాస్టల్‌ను మూయించారని వసతిగృహాన్ని వెంటనే ఖాళీ చేయాలని, అధికారులు అదేశాలు జారీ చేశారన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే విశ్వవిద్యాలయం చాన్స్‌లర్, గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని విద్యార్థులు హెచ్చరించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230